
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 25 ఆగస్టు 2024



ఆలయాల్లో శ్రావణ సందడి 7లో..
ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు 8లో..

ముచ్చటగా మూడోసారి..


నూకపల్లి వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

- డబుల్ ఇళ్లకు మళ్లీ దరఖాస్తులు
- లబ్ధిదారులను వెతికే వేటలో అధికారులు
- మీ సేవా కేంద్రాల ద్వారా అప్లికేషన్ల స్వీకరణకు కసరత్తులు
- పూర్తయినవి.. 4,520.. ఎంపికైంది 3,722

జగిత్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు గూడు కల్పించడా నికి గత ప్రభుత్వం అమలు చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల కోసం జిల్లా కేంద్రంలో మరోమారు దరఖాస్తులు ఆహ్వానించనున్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు తాజాగా దరఖాస్తుల స్వీకరణ జరపడానికి అవసరమైన కసరత్తులు చేస్తున్నారు. మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నారు. జిల్లా కేంద్రం శివారులోని నూ కపల్లి వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలో అవసరమైన మౌ లిక వసతులకు ఇటీవల ప్రభుత్వం రూ. 31 కోట్ల నిధులు మంజూరు చేయగా పనులను సాధ్యమైనంత తొందరలో పూర్తి చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. నూకపల్లి వద్ద డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మొదటి విడత పంపిణీని గత యేడాది అక్టోబర్ 3న అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా జరిపారు. మిగిలిన ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికపై ప్రస్తుతం అధికారులు దృష్టి సారించారు.

అర్హులను వెతికే పనిలో అధికారులు

మల్యాల మండలం నూకపల్లి వద్ద డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయింది. సంబంధిత కాలనీలో మౌలిక వసతుల పనులు జరగాల్సి ఉంది. గత ప్రభుత్వం తొలిసారిగా జగిత్యాలకు 520 ఇళ్లు మాత్రమే మంజూరు చేసింది. ప్రస్తుత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిజామాబాద్ ఎంపీగా వ్యవహరించిన సమయంలో జగిత్యాలకు మరో 4,000 ఇళ్లను మంజూరు చేయించారు. దీంతో నూకపల్లి వద్ద దాదాపుగా 4,520 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. అధికారులు గతంలో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులను స్వీకరించారు. పట్టణానికి చెందిన 11,500 మంది నిరుపేదలు డబుల్ ఇళ్ల కోసం దరఖాస్తులు సమర్పించారు. గడువు పెంచాలని వచ్చిన డిమాండ్ మేరకు అప్పటి ప్రభుత్వ హయాంలోనే మరోమారు దరఖాస్తులను స్వీకరించారు. రెండో పర్యాయం 2,400 దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా రెండు విడతల్లో 13,900 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులు ఒక్కో దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తు దారుల్లో 3,722 మంది మాత్రమే అర్హత కలిగియున్నట్లుగా తేల్చారు. దీంతో మరో 798 ఇళ్లకు లబ్ధిదారులను వెతికే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.

అర్హత లేకపోవడంతో...

జిల్లా కేంద్రంలో డబుల్ ఇళ్ల వ్యవహారంలో వినూత్న పరిస్థితి చోటు చేసుకుంది. ఇతర ప్రాంతాల్లో వేల సంఖ్యలో దరఖాస్తుదారులు ఉంటుండగా పదులు, వందల సంఖ్యలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం డ్రా పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేస్తుంటారు. కానీ జగిత్యాలలో డబుల్ ఇళ్లకు తగిన సంఖ్యలో అర్హులు లభించడం లేదు. దీంతో అధికారులు పలు పర్యాయాలు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రెండు సార్లు దరఖాస్తులను స్వీకరించినప్పటికీ అర్హులు దొరకక ప్రస్తుతం మరో మారు దరఖాస్తులను ఆహ్వానిస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. వచ్చే రెండు, మూడు రోజుల్లో మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు మాత్రమే ప్రస్తుతం దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు.

వేగవంతంగా మౌలిక వసతుల కల్పన పనులు...

నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీలో నిర్మాణమైన ఇళ్ల వద్ద మౌలిక వసతుల కల్పనకు తోడు మిగిలిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంపై ఎ మ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ప్రతిపాదలన మేరకు సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచనల మేరకు మౌలిక వసతుల కల్పనకు రూ. 18.21 కోట్లు, మంచినీటి వసతి పనులు నిర్వహించడానికి, రూ. 14.15 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ పనులను వేగవంతం చేయడానికి రెండు రోజుల క్రితం కలెక్టరేట్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ సత్యప్రాద్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు పనులు వేగాన్ని పుంజుకుంటున్నాయి.

రేషన్ కార్డు సమస్య వల్లే...

జగిత్యాల పట్టణంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పొందడానికి అవసరమైన లబ్ధిదారులు దొరకకపోవడానికి పలు అంశాలు కారణమవుతున్నాయి. దరఖాస్తుతో పాటు తప్పని సరిగా జగిత్యాల నివాసిగా ఉన్న గుర్తింపు పత్రం, ఆధార్‌కార్డు, ఫుడ్ సెక్యూరిటీ కార్డు తదితర పత్రాలు జత పరచాల్సి ఉంటుంది. జిల్లా కేంద్రానికి పలు ప్రాంతాల నుంచి ఉపాధి, వ్యాపారం, ఉద్యోగం నిమిత్తం పలు కుటుంబాలు వలస వచ్చి స్థిర నివాసం ఏర్పరుచుకుంటున్నాయి. కొన్నేళ్లుగా కొత్త రేషన్ కార్డులు ప్రభుత్వం మంజూరు చేయకపోవడం, ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయిన చిన్న చిన్న కుటుంబాలకు ఇప్పటికీ ఉమ్మడిగానే రేషన్ కార్డు ఉండడం, వలస వచ్చిన కుటుంబాలకు కార్డులు దక్కకపోవడం సమస్యగా మారింది. రేషన్ కార్డులలో మార్పులు, చేర్పులు జరగకపోవడం సైతం సమస్యకు కారణమైంది. వలస వచ్చిన పలు కుటుంబాలు ఏళ్లు గడుస్తున్నా తమ సొంత గ్రామాల్లోనే రేషన్ కార్డులు కలిగియుంటుండడం వల్ల జగిత్యాలలో రేషన్ కార్డు సమర్పించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దరఖాస్తులు తక్కువగా రావడం, వచ్చిన దరఖాస్తులు సైతం స్క్రూటినీలో తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయాలున్నాయి.

మరోమారు దరఖాస్తులను ఆహ్వానించడానికి నిర్ణయం
జంగిటి రాజేశ్వర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి



జగిత్యాల పట్టణంలోని అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించడానికి మరోమారు దరఖాస్తు లను ఆహ్వానించడానికి నిర్ణయం తీసుకున్నాము. గతంలో రెండు సార్లు స్వీకరించిన దరఖాస్తుల్లో అర్హత లేక పోవడం వల్ల పలు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి తగ్గట్టుగా లబ్ధిదారుల జాబితా లేకపోవడంతో మళ్లీ దరఖాస్తులు స్వీకరించడానికి ప్రయత్నిస్తున్నాము. దరఖాస్తుల తేదీలను నిర్ణయించాల్సి ఉంది.

సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే...
డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో నూకపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీ సమ స్యలు పరిష్కారం అవుతున్నాయి. కాలనీలో మౌలిక వసతుల కల్పనతోపాటు, పంపిణీ చేయకుండా మిగిలి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు మరోమారు దరఖాస్తులను ఆహ్వానించనున్నారు. వచ్చే దసరా నాటికి ఇళ్ల పనులు సంపూర్ణంగా పూర్తి చేస్తాము.

క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలి
ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న నోడల్ అధికారి వెంకటేశ్వర్లు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 24: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని జిల్లా ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ప్రథమ సంవత్సరం విద్యార్థినుల కోసం నిర్వహించిన స్వాగతోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొబైల్, ప్రేమ, మత్తు, పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని సూచించారు. విద్యార్థులచే ప్రదర్శించబడిన పలు నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆలియా మక్సూద్, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగభూషణంతో పాటు అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

లోకమాతపోచమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాలరూరల్, ఆగస్టు 24 : లోకమాత పోచమ్మ 62వ వార్షికోత్సవ ఉత్సవాల నిర్వహణ అభినందనీయమని జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ అన్నారు. శనివారం ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహించుట సంతోషదాయకమన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గాజుల రాజేందర్, కార్యక్రమ నిర్వాహకులు నాగమల్ల మనోహర్, రేపల్లె హరికృష్ణ, డా. రాజగోపాలచారి, ములస్తం మల్లికార్జున్, జనగామగం గాధర్, సుగుణాకర్, రాఘవచారి, మగ్గిడిగంగాధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్, ఎస్పీ


హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్, ఎస్పీ

జగిత్యాలరూరల్, ఆగస్టు 24 : రాష్ట్ర హైకోర్టు జడ్జి తుకారాంజి శనివారం ల జిల్లా కేంద్రంలోగల కోర్టును సందర్శించారు. ఈసందర్భంగా జిల్లాలోని మెడిక ల్ కాలేజీ గెస్ట్ హౌస్‌లో కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ హైకోర్టు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి
కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని నూకపల్లి వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు మీ సేవ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విదంగా జగిత్యాల మున్సిపల్ పరిదిలో అధిక సంఖ్యలో ఇళ్లు మంజూరు చేసుకొని నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. గతంలో దరఖాస్తులు చేసుకున్న వారిలో పరిశీలన అనంతరం సుమారు 80 శాతం గృహాలను కేటాయించారన్నారు. మిగిలిన 20 శాతం గృహాల కోసం మీ సేవా ద్వారా ఈనెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి ఇచ్చామన్నారు. గతంలో దరఖాస్తు చేయని మహిళా లబ్ధిదారులు మాత్రమే దరఖాస్తు సమర్పించాలన్నారు. దివ్యాంగులు సదరం సర్టిఫికేట్ జిరాక్స్, కుటుంబ మహిళ చనిపోయిన యెడల డెత్ సర్టిఫికెట్‌తో పాటు కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ తహసీల్దార్ కార్యాలయం నుంచి తీసుకొని సమర్పించాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి..
ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి గెస్ట్ లెక్చరర్ల వినతి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 24: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్‌లుగా సేవలందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ప్రభుత్వ జూనియర్ కళాశాలల గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యాపకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కారణంగా రాష్ట్రంలోని 1654 మంది గెస్ట్ లెక్చరర్‌లుగా సేవలందిస్తూ శ్రమదోపిడీకి గురవుతున్నామన్నారు. గెస్ట్ లెక్చరర్‌లుగా పనిచేస్తున్న కొందరి వయోపరిమితి దాటి ఇతర పోటీ పరీక్షలకు అర్హత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గెస్ట్ లెక్చరర్‌ల మాదిరిగానే ఎంపిక కాబడిన కాంట్రాక్ట్ లెక్చరర్‌లను క్రమబద్ధీకరించారని, తమను కూడా కాంట్రాక్టు లెక్చరర్‌లుగా మార్చి న్యాయం చేయాలని జీవన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్సీ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యాబోధన చేస్తున్న అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడం ప్రభుత్వం బాధ్యత అని, దశాబ్ద కాలంగా అందించిన సేవలకు ఉద్యోగ భద్రత కల్పన అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాలల గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ బాధ్యులు, గెస్ట్ లెక్చరర్‌లు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని ఇంది రాభవన్‌కు వచ్చిన ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు సైతం గెస్ట్ లెక్చరర్‌లు కలిసి త మ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన విప్ ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం చేసేలా చూస్తానన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌కు గెస్ట్ లెక్చరర్‌లు కృతజ్ఞతలు తెలిపారు.


ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న గెస్ట్ లెక్చరర్లు

బీఎల్‌వో విధుల నుంచి తప్పించాలి
ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్‌లకు వినతి పత్రం అందజేసిన పంచాయతీ కార్యదర్శులు

జగిత్యాలరూరల్, ఆగస్టు 24 : బీఎల్‌వో విధుల నుంచి పంచాయతీ కార్యదర్శులను తప్పించాలని కోరుతూ శనివారం జిల్లా పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ సమీకృత కార్యాలయంలో జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను, ఇందిరా భవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు బీఎల్‌వో డ్యూటీ చేస్తే మిగతా పోలింగ్ బూత్‌లపై పర్యవేక్షణ కోల్పోతారని, దీని ప్రభావం రాబోయే స్థానికసం స్థల ఎన్నికల్లో తప్పులు జరిగే అవకాశం ఉందన్నారు. దీనితోపాటు పారిశుధ్య నిర్వహణ విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవడంలో అంతరాయం ఏర్పడుతుం దన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరామర్శ

రాయికల్, ఆగస్టు 24: మండలంలోని రాజనగర్ గ్రామంలో మాజీ సర్పంచ్ భర్త, కాంగ్రెస్ నాయకుడు రాజేశ్వర్ రెడ్డి మరణించగా ఆయన మృత దేహానికి ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని తాట్లవాయి గ్రామంలో ఎనుగంటి మహేష్ నానమ్మ ఎనుగంటి గంగవ్వ మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్ రావు, కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మహేందర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, కొసరి మహేష్, చెట్లపెల్లి రాజేందర్, మోహన్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన జిల్లా అటవీశాఖ అధికారి

ధర్మపురి, ఆగస్టు 24: ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను శనివారం జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) రవిప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రవిప్రసాద్ ఉదయం ప్రభుత్వ విప్‌ను తన క్యాంపు కార్యాలయంలో ఉన్న సమయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రవిప్రసాద్‌కు తన వంతు సహకారం ఉంటుందని ఆయన తెలిపారు. ధర్మపురి ఎఫ్‌ఆర్‌వో శ్రీనాథ్, ఎఫ్ఎస్‌వో సదాశివుడు, ఎఫ్‌బీవో రవీందర్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ధర్మపురి ఎస్ఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన గంగుల మహేష్ కూడ ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.


లక్ష్మణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎఫ్‌వో

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి
చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం, ఆగస్టు 24: శంకరపట్నం మండలం వంకాయగూడెం శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంకాయగూడెంకు చెందిన చల్ల కనకయ్య (58) శుక్రవారం తెల్లవారు జామున బహిర్భూమికి వెళ్లేందుకు ఇంట్లో నుంచి బయటకు వచ్చి రోడ్డుపైన వెళ్తున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో రోడ్డుపై పడి ఉన్న కనకయ్యను చూసిన స్థానికులు మృతుడి భార్య మధనవ్వకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు కనకయ్యను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కనకయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

ఆధునిక కాలంలో
జంతుశాస్త్ర పురోగతి అవసరం



ప్రొఫెసర్ రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమేశ్

జమ్మికుంట, ఆగస్టు 24: ఆధునిక కాలంలో జంతుశాస్త్ర పురోగతి ఎంతో అవసరం ఉందని ఉస్మానియా విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జంతుశాస్త్రంలో ఇటీవలి పురోగతులు అనే అంశంపై ఒక రోజు సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ మట్లాడుతూ మానవ మనుగడపై విద్యార్థులు జంతుశాస్త్ర అభివృద్ధికి వినూత్నమైన పరిశోధనలు చేయాలని సూచించారు. మానవళి అభ్యున్నతి జంతుశాస్త్ర పురోగతితో ముడిపడి ఉందన్నారు. ఆధునిక కాలంలో రోజు రోజుకు పెరుగుతున్న క్యాన్సర్ వ్యాధి కారకాలు, వాటి నివారణ, తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రిన్సిపాల్ బి రమేశ్‌ప్రొఫెసర్ రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేశ్, జంతుశాస్త్ర విభాగాధిపతి కె గణేశ్, కళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కే రాజేంద్రం, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ ఓదేలు కుమార్, జంతుశాస్త్ర అధ్యాపకులు మమత, రమేశ్, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సైదాపూర్, ఆగస్టు 24: సైదాపూర్ మండలంలోని లస్మన్నపల్లి గ్రామ స్టేజీ వద్ద ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. పీడీఎస్ బియ్యం తరలిస్తున్న దిరావత్ పాండు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసీ, ట్రాలీని సీజ్ చేశామని తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



నృసింహుడిని దర్శించుకుంటున్న భక్తులు

నృసింహుడి సన్నిధిలో శ్రావణ భక్తుల రద్దీ

ధర్మపురి, ఆగస్టు 24: ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు శ్రావణ మాసం మూడవ శనివారం భక్తులతో రద్దీగా అగుపించాయి. ఉద యం వేళలో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితక వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, మంత్రపుష్పాలు, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం, నరసింహ హోమం జరిపించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందిం చారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, ఆగస్టు 24: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం భేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య పర్యవేక్షకులు హరిహర నాథ్, చంద్రశేఖర్, సునీల్ ఇతరఅధికారులు పర్యవేక్షించారు. ఆంజనేయస్వామిని జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు.



కొండగట్టులో పూజలు చేస్తున్న భక్తులు

అవినీతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వ పాలన

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

ముస్తాబాద్, ఆగస్టు 24: అక్రమాలకు, అవినీతికి తావు లేకుండా రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చేలా పాలన కొనసాగిస్తోందన్నారు. గతంలో అవినీతి అక్రమాలతో ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టి అస్తవ్యస్తంగా పనులు చేయడంతో అర్థాంతరంగా నిలిచిపోయాయన్నారు.. గతంలో పనులు చేతకాక కేటీఆర్, హరీష్‌రావు అవినీతి అక్రమాలకు పాల్పడ్డార న్నారు. ఇప్పుడు పనులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కుటుంబ పాలనతో ప్రజలను ఎన్నో ఇబ్బం దులకు గురిచేశారన్నారు. దీంతో ప్రజలే ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. ఓవైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాళేశ్వరం ప్రాజెక్టుకు వెళ్లడం ఒక డ్రామా అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి రెండు లక్షల రైతు రుణమాఫీ చేసి రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులు మతి లేని మాటలు మాట్లాడడం ప్రజలు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న కటకం మృత్యుంజయం

చేస్తున్న పనులకు అడ్డం పడుతూ సమయాన్ని వృధా చేయడం బీఆర్ఎస్ మానుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉండి ప్రజల సమస్యలను ప్రభు త్వానికి విన్నవించడం గౌరవప్రదమని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, నాయకులు తాళ్ల విజయ్ రెడ్డి, దీటి నర్సింలు, ముచ్చర్ల శ్రీనివాస్, తలారి నర్సింలు, భాను, గంత రాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సౌదీలో యువకుడి మృతి

- కరీంనగర్‌లో విషాదం



షహెదా ఖాన్(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24: కరీంనగర్ ఆదర్శనగర్‌కు చెందిన ఎండీ షహెదా ఖాన్(27) సౌదీ అరేబి యాలో నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు సమాచారం అందడంతో మృతుడి ఇంట విషాదం నెలకొంది. కరీంన గర్ ఆదర్శనగర్‌కు చెందిన ఎండీ షహెదాఖాన్ ఏడు సంవత్సరాల క్రితం ఉపాధి కోసం సౌదీ అరేబియాకు వెళ్లి అక్కడ ఒక సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఏడాదికి ఒకసారి స్వదేశానికి వచ్చి వెళ్లేవాడు. ఆదర్శనగర్‌కు చెందిన షహెదాఖాన్ తండ్రి స్వస్థలం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, తల్లిది కరీంనగర్. షహెదాఖాన్ కరీంనగర్‌కు చెందిన మహిళను వివాహం చేసుకుని ఇక్కడే ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్నాడు. వారికి రెండు సంవత్సరాలు, 8 నెలల ఇద్దరు పిల్లలున్నారు. ఏడాది కిందటే షహెదాఖాన్ కరీంనగర్‌కు వచ్చి కొన్నిరోజులు భార్యపిల్లలు, కుటుంబ సభ్యులతో గడిపి తిరిగి సౌదీ అరేబియాకు వెళ్లాడు. షహెదాఖాన్ మరణించాడని తెలిసిందని, కానీ సౌదీ అరేబియా నుంచి అధికారికంగా పూర్తి సమాచారం అందలేదని మృతుడి బంధువులు వెల్లడించారు. సౌదీఅరేబియాలో శుక్రవారం నుంచి మూడు రోజులు సెలవుదినాలు కావడంతో మృతదేహం పంచనామా, పోస్టుమార్టం పూర్తి అయి స్వదేశానికి చేరేందుకు వారం పది రోజులు పట్టే అవకాశముందని మృతుడి బంధువులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గొల్లపల్లి, ఆగస్టు 24: గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు చేసి శనివారం పట్టుకున్నారు. డీటీ శ్రీని వాస్, పౌరసరఫరాల శాఖ ఇన్స్‌పెక్టర్ స్వామి ఆధ్వర్యంలో పక్కా సమాచారం మేరకు గ్రామంలో పస్తం కనకయ్యకు చెం దిన షెడ్డులో అధికారులు సోదాలు చేయగా 11 క్వింటాళ్ల విలువైన 20 బస్తాల పీడీ ఎస్ రైస్ పట్టుబడింది. వాటిని స్వాధీనం చేసుకుని గోదాంకు తరలించారు. కనకయ్యను అదుపులోకి తీసుకుని, అతడి పై సెక్షన్ 6-ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వీణవంక: మండలంలోని ఘన్ముక్ల గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండుగా పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. సుల్తానాబాద్‌కు చెందిన బోనగిరి సురేష్ పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

రాజన్న ఆలయంలోని వివిధ విభాగాల్లో అవకతవకలు

- రెండు రోజుల పాటు ఏసీబీ అధికారుల తనిఖీలు - ఉన్నతాధికారులకు నివేదిక సమర్పణ

వేములవాడ కల్చరల్, ఆగస్టు 24: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో పలు విభాగాల్లో అవకతవకలు బయటపడ్డాయి. రెం డు రోజులపాటు ఆలయంలోని పలు విభాగాల్లో క్షుణ్ణంగా పరిశీలించిన ఏసీబీ అధికారులు పలు అవకతవకలు గుర్తించి ఉన్నత స్థాయి అధికా రులకు శనివారం నివేదికను అందించారు. ఏసీబీ తెలంగాణ పేరుతో అధికారులు ఎక్స్‌లో అవకతవకలతో కూడిన పోస్టును విడుదల చేశారు. రాజన్న ఆలయంలోని లడ్డూల త యారీ విభాగంలోని స్టాక్ రిజిస్టర్‌లో తేడాలు ఉండటం గుర్తించారు. నెయ్యి, జీడిపప్పు, నూనే సంబంధిత వాటిలో తేడాలు బయటపడ్డాయి. తలనీలాలు సమర్పించడం కోసం వచ్చే భక్తుల నుంచి కల్యాణకట్ట వద్ద రూ. 50 నుంచి రూ. 100 వసూలు చేయడం, నూతన టెండర్లకు కమిషనర్, దేవాదాయ శాఖ ఆమోదం లేకుండానే పాత టెండర్ల ప్రకారం వస్తువులను కొనుగోలు చేయడం వంటి అవకతవకలు బయటపడ్డాయి.

● ఆలయ ఉద్యోగుల్లో ఆందోళన..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం, శుక్రవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. రెండు రోజులపాటు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో పలు విభాగాల్లోని ఫైళ్లను సీజ్ చేసి తీసుకువెళ్లారు. ఏసీబీ అధికారులు పలు విభాగాల్లో అవకతవకలు ఉన్నట్లు ఉన్నతాధికారులకు నివేదికను అందజేశారు. దీంతో సంబంధిత విభాగాల ఉద్యోగులు ఇరుక్కున్నామని భయాందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది.



← Post

ACB Telangana
@TelanganaACB

#ACBOfficials conducted Surprise Check at Sri Raja Rajeshwara Temple, Vemulawada of Rajanna Sircilla District and the EO Office on 22.08.2024. (Yesterday)

The following irregularities were identified.

1) Variations in the stock register (related to Ghee, Cashew nut and Oil)

2) Collecting Rs.50/- / 100/- per rach piligrim for head tonsuring at Kalyanakatta.

3) Without approval of tenders by the Commissioner, Endowment dept for the process of items (Maximum) purchasing. But they are following old tenders.
#AntiCorruptionBureau #Telanagana #Justice @CVAnandIPS

ఏసీబీ తెలంగాణ పేజీలో వైరల్‌గా మారిన అవకతవకల పోస్ట్

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ బలవన్మరణం

గొల్లపల్లి, ఆగస్టు 24: మండలంలోని వెన్గుమట్ల గ్రామంలో శనివారం తీరని విషాదం నెలకొంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఓ ఆటోడ్రైవర్ రెండు నెలల క్రితం నెలల తక్కువతో జన్మించిన తన చిన్నారికి మెరుగైన వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక జీవితం మీద విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పొన్నం వెంకటేష్ (28) అనే నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు గ్రామంలో ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. వెంకటేష్‌కు రెండేళ్ల క్రితం వివాహం జరగగా రెండు నెలల క్రితం ఓ ఆడ శిశువు జన్మించింది. చిన్నారి పుట్టిన నాటి నుంచి అనారోగ్యంతో బాధపడుతుండడతో ప్రైవేట్ అసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఇప్పటికే చిన్నారి వైద్య ఖర్చుల కోసం బంధుమిత్రులు, తెలిసిన వాళ్ల దగ్గర అప్పులు చేసి సుమారు రూ. 4 లక్షల మేర వెచ్చించారు. అయినా చిన్నారి జబ్బు నయం కాకపోగా మరింత ముది రింది. దీనికి వైద్యులు చిన్నారి ప్రాణాపాయం నుంచి బయటపడాలంటే మెరుగైన వైద్యం చేయించాలని, అందుకు పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వెంకటేష్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. బిడ్డకు మెరుగైన వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక జీవితం మీద విరక్తి చెంది శనివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు.

మహిళలకు లోన్‌యాప్ వేధింపులు

గంగాధర, ఆగస్టు 24: మండలంలో పలువురి మహిళలకు లోన్‌యాప్ సిబ్బంది ఫోన్ చేసి వేధింపులకు గురి చేస్తున్నారు. తాను లోన్‌తీసుకోకున్న ఆన్‌లైన్‌లో రుణం పొందిన వ్యక్తికి సాక్షి సంతకం చేయగా రుణం తిరిగి చెల్లించక పోవడంతో సాక్షి సంతకం చేసిన వ్యక్తి మహిళ బంధువులతో పాటు ఆ గ్రామ మహిళా మాజీ సర్పంచ్ భర్తను లోన్‌యాప్ సిబ్బంది అసభ్య కరంగా మాట్లాడుతూ వేధింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ యువకుడు ఆన్‌లైన్‌లో లోన్‌యాప్‌లో రుణం తీసుకున్నాడు. రుణం తీసుకున్న స్నేహితుడికి గంగాధర మండలంలోని యువకుడు ఆన్‌లైన్‌లో సాక్షి సంతకంతో పాటు ఫోన్ నంబర్ జతచేశాడు. రుణం తీసుకున్న యువకుడు సకాలంలో చెల్లించలేదు. దీంతో సాక్షి సంతకం పెట్టిన మండలంలోని యువకుడి మొబైల్‌లోని కాంటాక్టు నంబర్లను సేకరించి మహిళలకు సంస్థ నుంచి పలుమార్లు ఫోన్ చేసి వేధింపులకు గురి చేశారు. సదరు వ్యక్తి తమకు తెలియదని సమాధానం చెప్పినా రుణం ఇచ్చిన వారు అసభ్యకరంగా మహిళ భర్తతో పాటు మరో పది మంది మహిళలతో మాట్లాడినట్లు తెలిపారు.

అదుపుతప్పి పొలంలో పడ్డ కారు

- మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు తప్పిన ప్రాణాపాయం

జగిత్యాలరూరల్, ఆగస్టు 24 : జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు వెళ్లే రహదారి లో శనివారం ఉదయం కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. శనివారం ఉదయం కారులో కరీంనగర్ నుంచి జగిత్యాల మీదుగా కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు కారులో ఐదుగురు ఉపాధ్యాయులు వస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రహదారి బురదమయమై పూర్తిగా దెబ్బతింది. ఈ క్రమంలో పాఠశాలకు వెళ్లే రహదారి మూల మలుపు వద్ద కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లడంతో కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈసంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయులకు ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు. పొలంలో పడ్డకారును ఉపాధ్యాయులు, స్థానికులతో కలిసి బయటకు తీశారు.

పెద్దపల్లి లైబ్రరీకి పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందజేత

పెద్దపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షల కోసం పోటీ పడే నిరుద్యోగ యువతీ యువకుల కోసం కావాల్సిన స్టడీ మెటీరియల్‌ను కరీంనగర్‌లోని బీఎస్ రావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీఎస్‌రావు లైబ్రరీకి అందజేశారు. శనివారం పెద్దపల్లి లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో అయన మాట్లాడుతూ విద్యార్థుల్లో స్కిల్స్ కొరత కారణంగా దేశంలో పదకొండు కోట్ల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు స్థాపిస్తే అభివృద్ధితో పాటు ఉపాధి కల్పన పెరుగుతుం దన్నారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ డాక్టర్ బీఎస్‌రావు ఎప్పటినుంచో పేదలకు ఉచిత వైద్య సేవలం దిస్తున్నారన్నారు. గత సంవత్సరం నుంచి విద్యాపరంగా నాలుగు జిల్లాల్లో పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకి ఇస్తున్నారు తెలిపారు. ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ఫణిందర్, అడ్వకేట్ ఆడెపు దినేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బీఎస్ రావు

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పెరిగిన వరద

- కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు పెరుగుతున్నది. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 23,094 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 16,564 క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 6,530 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. నంది పంప్‌హౌస్ నుంచి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడడంతో వరద నీరు ఎక్కువగా వస్తున్నది. ప్రాజెక్టు నిండడంతో గేట్లు ఎత్తి గోదావరిలోకి వదులుతున్నారు. ఆ నీరంతా శ్రీపాద ఎల్లంపల్లికి చేరుతున్నది. మరింత వరద పెరిగితే మాత్రం నంది పంప్‌హౌస్‌లో మరో రెండు మోటార్లు ఆన్ చేసి 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలని భావిస్తున్నామని నీటి పారుదల శాఖాధికారులు పేర్కొన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.529 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతుంది. శనివారం రెండు పంపుల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 18.5 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

ఎల్ఎండీకి నీటి విడుదల ప్రారంభం

బోయినపల్లి, ఆగస్టు 24: మిడ్ మానేరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ఎల్ఎంపీలోకి నీటి విడుదలను శనివారం ప్రారంభించారు. మిడ్ మానేరులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6300, ములవాగు మానేరు వాగు ద్వారా 700 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 313.99 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 18.33 టీఎంసీల మేరకు చేరుకొంది. కాగా ఎల్ఎండీ ప్రాజెక్ట్‌కు రెండు వేల క్యూసెక్కుల నీటి విడుదలను ప్రాంభించారు.

శ్రీరాంసాగర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం ఇన్‌ఫ్లో పెరిగింది. ఎస్సారెస్పీలోకి 29,443 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 51.659 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అసరాలకు ప్రాజెక్టు నుంచి 3,822 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అంతరాలయ దర్శన టికెట్ల పునరుద్ధరణ



అంజన్న ఆలయం

మల్యాల, ఆగస్టు 24: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో కొన్నాళ్ల క్రితం కోవిడ్-19 నేపథ్యంలో నిలిచిపోయిన అంతరాలయ దర్శన టికెట్లను పునరుద్ధరిస్తున్నట్లు ఈవో రామకృష్ణారావు తెలిపారు. కొవిడ్‌కు ముందు రూ.400 టికెట్ అంతరాలయ దర్శనంలో భాగంగా సంప్రదాయ దుస్తులతో అయిదుగురికి దర్శనం కల్పించగా కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో 16 మార్చి 2020 నుంచి అంతరాలయ దర్శనాలు నిలిపివేశారు. శనివారం నుంచి మళ్లీ యదావిధిగా రూ.400టికెట్‌తో అంతరాలయ దర్శనాలు పునరుద్ధరించినట్లు భక్తులు సహకరించాలని ఈవో పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం

- ఉన్నత ఉద్యోగం సాధించినా రిలీవ్ చేయడం లేదని ఆవేదన - మండలపరిషత్ కార్యాలయంలోనే ఘటన



చికిత్సపొందుతున్న శ్రీనివాస్

ఇల్లంతకుంట, ఆగస్టు 24: ఉన్నతస్థాయి ఉద్యోగం సాధించినా మండలపరిషత్ అధికారులు రిలీవ్ చేయడం లేదంటూ రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కిష్టరావుపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శి లంబాడి శ్రీనివాస్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. తోటి పంచాయతీ కార్యదర్శుల వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా హవేలీఘన్‌పూర్ మండలం పర్దీన్‌పూర్ గ్రామానికి శ్రీనివాస్ నారాయణఖేడ్ మండలం అంత్వార్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశాడు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన 317 జీవోతో ఇల్లంతకుంట మండలం కిష్టరావుపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యాడు. ఇల్లంతకుంటలో తోటి పంచాయతీ కార్యదర్శులతో ఉంటూ శ్రీనివాస్ పోటీపరీక్షలకు సిద్ధం అవుతూనే విధులు నిర్వహించే వాడు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో మెదక్ మున్సిపాలిటీలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 31లోపు విధుల్లో చేరవలసి ఉంది. తనను పంచాయతీ కార్యదర్శి నుంచి రిలీవ్ చేయాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. అయినా ఆలస్యం జరుగుతుండటంతో శనివారం మండలపరిషత్ కార్యాలయానికి చేరుకొని ఎంపీడీవోకు సమస్యను విన్నవించాడు. వెంటనే పక్కన ఉన్న గదిలోకి వెళ్లి వెంటతెచ్చుకున్న క్రిమిసంహారక మందుతాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఇల్లంతకుంటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రథమ చికత్స జరిపి ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. తొమ్మిది ఉద్యోగాలు సాధించాడని గతంలో ఇదే మండలపరిషత్ కార్యాలయంలో సన్మానం పొందిన శ్రీనివాస్‌ను అపస్మారకస్థితిలో తరలించడాన్ని మండలపరిషత్ సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. సంఘటనపై ఎంపీడీవో శశికళను వివరణ కోరగా రెండు రోజుల క్రితమే తమకు లేఖ అందిందని, ఎంపీవో నుంచి ఎన్‌వోసీ తెచ్చుకోవాలని సూచించానని తెలిపారు. తొందరపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, తాము ఎక్కడా ఆలస్యం చేయలేదని వివరించారు.

- అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 24: విధుల్లో పట్ల అంకితభావంతో పని చేస్తున్న ఉద్యోగికి మరో ఉద్యోగం రావడంతో రిలీవ్ చేయడంలో మానసికంగా వేధింపులకు పాల్పడిన ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు డిమాండ్ చేశారు. అధికారుల తీరుతో మనస్తాపానికి గురై ఇల్లంతకుంట మండల పరిషత్తు కార్యాలయంలో పురుగుల మందు తాగిన కిష్టరావుపల్లి పంచాయతీ కార్యదర్శి లంబాడి శ్రీనివాస్‌ను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శనివారం వారు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శిగా పనులు చేస్తూనే ఉన్నత ఉద్యోగం సాధించిన శ్రీనివాస్‌ను మండల పరిషత్ అధికారులు విధుల నుంచి రిలీవ్ చేయకపోవడం వల్లే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వేధింపులకు గురిచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన కుటుంబంలో జన్మించిన శ్రీనివాస్ ఎన్నో కష్టాలను అధిగమించి ఉన్నత ఉద్యోగం సాధిస్తే రిలీవ్ చేయాల్సిన అధికారులు ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమని బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేశ్‌నాయక్ అన్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తిరుపతినాయక్ తదితరులు ఉన్నారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

ధర్మపురి, 24 :ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో సట్టంశెట్టి రజని (39) అనే వివాహిత శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆమె దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోరుట్ల రూరల్, ఆగస్టు 24 : మండలంలోని వివిధ గ్రామాల నుంచి కో రుట్ల పట్టణానికి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నట్లు తహసీల్దార్ కిషన్ శనివారం తెలిపారు. మండలం లోని వివిధ గ్రామాలలో రెవెన్యూ అధికారులతో దురుసుగా ప్రవర్తించిన వారిపై కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఆర్ఐ రాజేందర్‌రావు ఇచ్చిన పిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రెండు రోజుల నుంచి అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న 22 ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 15 మందికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24: మద్యం సేవించి వాహనాలు నడపుతూ ఇటీవల కరీంనగర్‌లో పట్టుబడిన 15మంది వాహనదారులకు కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 70మందిని ట్రాఫిక్ పోలీసులు శనివారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఇందులో ఐదుగురికి 7 రోజులు, 10 మందికి 3 రోజులు జైలు శిక్ష, మొత్తం 34 వేల జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు. మిగతా 55మందికి 90 వేల 500 రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు 223 వాహనదారులకు జైలు శిక్షలు పడ్డాయని సీఐ తెలిపారు.

రాజన్న సేవలో బీసీ కమిషన్ సభ్యుడు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 24: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు కిషోర్‌గౌడ్ శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొని కోడెమొక్కు చెల్లించుకున్నారు. సూపరింటెండెంట్ తిరుపతిరావు, పీఆర్వో అశోక్ ప్రసాదం అందజేశారు.



స్వాగతం పలుకుతున్న సూపరింటెండెంట్ తిరుపతిరావు

గుర్తుతెలియని వృద్ధురాలు మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24: కరీంనగర్ కోర్టు సమీపంలోని వాటర్‌టాంక్ పక్కన గుర్తుతెలియని వృద్ధురాలు(65) మృతిచెందిందని రెండో టాణా పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి 9గంటల సమయంలో వృద్ధు రాలు పడిపోయి ఉండగా గుర్తించిన పోలీసులు ఆమెను అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చూరీ గదికి తరలించి భద్రపరిచినట్లు తెలిపారు. వృద్ధురాలిని గుర్తించి నవారు రెండో టాణా పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, ఆగస్టు 24: మండలంలోని మండెపల్లి కేసీఆర్ నగర్‌కు చెందిన బోయిని సదానందం (45)పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం ఇంటి బయట పురుగుల మందు తాగగా గుర్తించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించినట్లు స్థానికులు తెలిపారు. సదా నందం సిరిసిల్ల మార్కెట్‌లో రైతుల వద్ద కూరగాయలు కొనుగోలు చేసి విక్రయించేవాడు. పది రోజులుగా మార్కెట్‌కు సైతం వెళ్లడం లేదని బంధువులు చెప్ప న్నారు. ప్రస్తుతం సదానందం పరిస్థితి విషమంగా ఉంది.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- సెస్ రిటైర్డ్ లైన్‌మెన్ మృతి

కోనరావుపేట ఆగస్టు 24: మండలంలోని ధర్మారం గ్రామ శివారులో బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా సెస్ రిటైర్డ్ లైన్‌మెన్ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సంజీవ్‌నగర్‌కు చెందిన ఆర్ వెంకట్రాజం (63) అనే వ్యక్తి గతంలో లైన్‌మెన్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. ప్రస్తుతం కోనరావుపేట మండల మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళుతుండగా ధర్మారం గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో కింద పడిపోయిన వెంకట్రాజముకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఆసుపత్రి తరలించారు. అసుపత్రిలో శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కోనరావుపేట ఎస్సై రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు



ధర్మారంలో బైకును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు


జగిత్యాలలో శ్రీ కృష్ణుని వేషధారణలో చిన్నారులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 24: పట్టణంలోని స్థానిక క్రిష్టా నగర్, శివవీధిలో గల అల్ఫోర్స్ పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి పండగను పురస్కరించుకొని ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సుమారు వంద మంది విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో చేసిన నృత్యాలు, ఆటలు ఆహూతులను అలరించాయి. విద్యార్థుల్లో భక్తిభావన పెంపొందించేందుకు, చారిత్రాత్మకమైన శ్రీకృష్ణు డి చరిత్రను తెలిపేందుకు ఈ వేడుకలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయ బృందం, పోషకులున్నారు.

●పట్టణంలోని స్థానిక కృష్ణానగర్‌లో గల గ్రావిటీ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారుల కృష్ణా, రాధ వేషధారణలు అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కరస్పాండెంట్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పట్టణంలోని మిషన్‌కాంపౌండ్‌లో గల స్లేట్ హైస్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి ఘనంగా వేడుకలు నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు, నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కరస్పాండెంట్ జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ తిరుపతిరెడ్డి, హెచ్ఎం స్వప్న, మల్లికార్జున్ ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడు కలను ఘనంగా నిర్వహించారు. పట్ట ణంలోని లిటిల్ ఫ్లవర్, లిటిల్ జీనియస్ పాఠశాలలో గోపిక కృష్ణ వేషధారణ అలంకరణతో విద్యార్థులు అకట్టుకున్నారు. హిందూ సంస్కృతి సంప్రదాయ పద్ధతిలో వేడుకలను నిర్వహించారు. రాధాకృష్ణ వేషధారణలో చిన్నారులు నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టి సంబరాలు జరుపుకు న్నారు. ఆయా కార్యక్రమాలలో పాఠశాలల కరస్పాడెంట్లు బండి మహదేవ్, తుమ్మనపల్లి మనోజ్ కుమార్, ప్రిన్సిపల్స్ సిరి కొండ గంగాధర్, రాధాకృష్ణ, కొత్త వినోద్, కటకం సంధ్యారాణి, పాఠశాలల డైరెక్టర్లు కొత్త రాజు, బండవ లావణ్య, కటకుంట్ల జోతి, చాఫ్ అడ్వైజర్ కటకం శంక ర్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజ్డాన్ కిడ్స్ పాఠశాలల్లో నిర్వహించి న కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు వేసిన వేషధారణ ఆకట్టుకుంది. గోపికలు, కృష్ణుడు వేషధారణలో చిన్నారులు ఆడిన కోలాటం అలరించింది. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం దొరిశెట్టి మల్లేశం, చెల్ల తిరుపతి, ఉపాధ్యాయ బందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బుగ్గారం: మండలంలోని వివిధ పాఠశాలల్లో శనివారం ముందస్తు కృష్ణా ష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వ హించిన వేడుకల్లో విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది. చిన్నారులచే ఉట్టి కొట్టే కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షబానా, రొట్టె ।నివాస్, త్రితేజ, సురేష్‌చందర్, మాధురి, కల్పన, పాల్గొన్నారు.

మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం): పట్టణంలోని పలు పాఠశాలల్లో శనివారం ముందస్తు కృష్ణష్టామి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నిఖిల్ భరత్ కాన్వెంట్, బ్రూక్లిన్, సాయి చైతన్య, ఐరిస్ పాఠశాలలో కృష్ణష్టామి వేడుకలను జరిపారు. విద్యార్థులు కృష్ణుడు, గోపిక వేషధారణలతో ఆకట్టుకున్నారు. చిన్నారుల అట, పాటలు అకట్టుకున్నాయి. ఉట్టి మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరస్పాండెంట్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని ఆంగ్లోవేదిక్, కేరళ ఇంగ్లీష్ మీడియం, విద్యా భారతి, చైతన్య భారతి, శ్రీ వాణి విద్యాలయం, గ్లోబల్ హైస్కూల్, పెద్దనక్కల పేట ఎస్ ఎస్ మాడల్ స్కూల్, దొనూర్, దొంతాపూర్, పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలు, కోలాట నృత్య ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం ఉట్టి కొట్టి వేడుకలు జరుపుకు న్నారు. ఆయా పాఠశాలల కరస్పాం డెంట్స్ సంగనభట్ల దినేష్, చిలువేరి శ్యాంసుందర్, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, హెచ్ఎంలు తోట శంకర్, సంతోషి, నాగశ్వేత, రమేష్, రాజేశం, డైరెక్టర్లు గట్ల శ్రీని వాస్, రాజేంద్రప్రసాద్, రాజేష్, శ్రీనివాస్, టీచర్లు పాల్గొన్నారు.

మల్లాపూర్ : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను యాజమాన్యాలు నిర్వహించారు. శనివారం మండలంలోని మొగిలిపేట, కుస్తాపూర్, మల్లాపూర్ గ్రామాల్లోని పాఠశాలలోని విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని ఉట్టి కొట్టారు.

మల్యాల: మల్యాల క్రాస్ రోడ్డులో గల అల్ఫోర్స్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను శనివారం నిర్వహించారు. విద్యార్థులు గోపిక వేషాదారణలో ఆకట్టుకోగా శ్రీ కృష్ణుడికి నైవేద్యాలు సమర్పించారు.

అనంతరం నృత్య ప్రదర్శన లు ఆకర్షణగా నిలిచాయి. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

కథలాపూర్: మండలంలోని బొమ్మెన ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోపిక, శ్రీకృష్ణుడి వే షధారణలతో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉట్టికొట్టే కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. హెచ్ఎం అంబటి రవి, ఉపాధ్యాయులు మేడిపల్లి సాయిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


ధర్మపురి ఆంగ్లోవేదిక్‌లో..


మెట్‌పల్లిలో గోపికల వేషధారణలో..



కోరుట్లలో చిన్నారుల వేషధారణలు


మల్యాలలో ఉట్టికొడుతున్న విద్యార్థులు

క్రీడాకారిణికి అభినందన

జగిత్యాల అర్బన్, ఆగస్టు 24: ఈ నెల 25,26 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ పోటీలకు పట్టణంలోని జ్యోతి పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని సంజన అండర్ 14 విభాగానికి ఎంపికైంది. పాఠశాల డైరెక్టర్‌లు బియాల హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, రజితరావు, మౌనికరావు, అజితరావుతో పాటు అధ్యాపకులు సంజనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

●మహబూబ్‌నగర్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే బాస్కెట్‌బాల్ జట్ల క్రీడాకారులకు క్రీడా దుస్తులను డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి అందజేశారు. ఆయనను సీనియర్ క్రీడాకారులు విశ్వప్రసాద్, కృష్ణప్రసాద్, అజయ్‌బాబు, వేణు, లక్ష్మణ్, శశి, అనిల్, వినయ్, మంగ, శ్రీరామ్, సామంత్, హరీష్, కోటేశ్వర్‌రావులు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్

పెగడపల్లి, ఆగస్టు 24: పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ పర్యటించి పలు వీధు ల్లో పారిశుధ్య పనులు, మోడల్ స్కూల్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని, తా గునీటి బావులు, ట్యాంక్‌లలో క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడాపోటీలను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 24: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో భీమయ్య అన్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల ల్లోని పీడీ, పీఈటీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించే పోటీలు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను అండర్-14, -17 క్రీడాకారులకు నిర్వహించడం జరుగుతుంది. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు మండల స్థాయిలో సెప్టెంబర్ 2, 3, 4 తేదీల్లో అండర్ 14, 17 క్రీడాకారులకు వెల్లుల్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్ నెం.8374974622ను సంప్రదించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకునేవిధంగా పీడీ, పీఈటీలు అవగాహన కల్పించాలని సూచించారు.

నీట్ పీజీలో 235వ ర్యాంక్

జాతీయ స్థాయిలో ముత్యంపేట యువతి ప్రతిభ



మల్యాల, ఆగస్టు 24: ఆల్ ఇండియా నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో మండలంలోని ముత్యంపేటకు చెందిన యువతి ప్రతిభ చాటింది. ఈ నెల 11న జరిగిన ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలో 235 ర్యాంక్ సాధించింది. ఇటీవలే హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న అలేఖ్య జాతీయ స్థాయిలో ప్రతిభ సాధించడంపై పలువురు అభినందిస్తున్నా రు. మొదటి నుంచి చదువులో ప్రతిభ చాటుతున్న అలేఖ్య తండ్రి మల్లేశం గ్రామంలో పీఎంపీ కాగా తల్లి గీత గృహిణి.

పోసానిపేట యువకుడికి 1285వ ర్యాంక్



కథలాపూర్: మండలంలోని పోసాని పేటకు చెందిన బత్తుల అజయ్‌కుమార్ అనే యువకుడు నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో ఆల్ ఇండియాలో 1285 ర్యాంకు సాధించాడు. ఈ ఏడాది మెడిసిటీ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. మంచి ర్యాంక్ సాధించి ఎంస్ లేదా ఎండీ చదవడానికి అవకాశం పొందిన అజయ్‌కుమార్‌ను మాజీ సర్పంచ్ ఎంజీ రెడ్డి అభినందించారు.

ఎమ్మెల్సీ కొదండరాంకు సన్మానం


కొదండరాంను సన్మానిస్తున్న కంతి మోహన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24: గవర్నర్ కోటాలో ఇటీ వల ఎమ్మెల్సీగా నియమితులైన ప్రొఫెసర్ కోదండ రాంను కోరుట్ల టీజేఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు కంతి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీజేఎస్ నాయకులు శనివారం హైదారా బాద్‌లో ఆయనను కలిసి పూలమాల, శాలువతో ఘనంగా సత్కరించి శుభాకంక్షాలు తెలిపారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చింత కుంట శంకర్, ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీటీసీ రాజరెడ్డి ఉన్నారు.

కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పన్నాల అంజయ్య

14 మంది డైరెక్టర్లతో కార్యవర్గం ఏర్పాటు

కోరుట్ల రూరల్, ఆగస్టు 24 : కోరుట్ల మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మార్కెట్ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

చైర్మన్‌గా మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన పన్నాల అంజయ్య (అంజిరెడ్డి), వైస్ చైర్మన్‌గా పుల్లూరి వెంకటేష్(కల్లూర్) డైరెక్టర్లుగా పల్లెపు రాజు (తిమ్మయ్యపల్లి), బోల్లే నర్సయ్య (చిన్నమెట్‌పల్లి) పడాల కవిత (మాదాపూర్), పోతుగంటి వెంకాగౌడ్ (సంగెం), జక్కుల రాజం (నాగులపేట), ఎనుగు బల్వంత్‌రెడ్డి (జోగినిపల్లి), శ్రీరాంల అమ రేంధర్(కోరుట్ల), జగనాథ్ లక్ష్మణ్, మహ్మద్ అయాబు, అబ్దుల్ వాజీద్ (కోరుట్ల) అల్లాడి శ్రీనివాస్ (గుమ్లాపూర్)లను నియమించింది. కోరుట్ల మండలంలోని అయిలాపూర్ మేజర్ గ్రామ పంచాయతీకి మార్కెట్ కమిటీ చైర్మన్ హోదాను రాష్ట్ర ప్రభుత్వం కల్పించడంతో ఆ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆశావదులు ఉండగా వారికి పదవి రాకపోవడంతో నిరాశకు గురయ్యారు.


పన్నాల అంజయ్య

మహిళాశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజేశం

కథలాపూర్, ఆగస్టు 24: మహిళాశక్తి పథకం కింద ప్రభుత్వం అందించబోయే యూనిట్లను స్థాపించుకుని ఉపాధి పొందాలని సెర్ప్ వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ వెంకటేశ్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో పెరటి కోళ్లు, పాడి పశువుల పెంపకం వల్ల చేకూరే లాభాలను వివరించారు. గ్రామీణ ప్రాంత మహిళలు తమ ఉపాధి అవకాశాలను పెంచుకునేందుకు ఈ యూనిట్ ఎంతో దోహదం చేస్తాయని సూచించారు. మహి ళల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ విభాగం ఏపీఎం హుస్సేన్, సెర్ప్ ఏపీఎం నరహరి, గ్రామ సంఘాల అధ్యక్షుడు ఉన్నారు.

బస్సు వేళలు మార్చాలని విద్యార్థుల ఆందోళన

భీమారం, ఆగస్టు 24: మండలంలోని వెంకట్రావుపేటలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శనివారం బస్సు వేళలు మార్చాలని ఆందోళన నిర్వహించారు. మారు మూల గ్రామమైన ఒడ్యాడ్ గ్రామం నుంచి జగిత్యాలకు వెళ్లే బస్సు సాయంకాలం గంట ఆలస్యంగా రావడంతో రోడ్డుపై వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత బస్సులు లేక, వచ్చే బస్సు ఆలస్యంగా రావడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్టీసీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని, జగిత్యాల నుంచి ఒడ్యాడ్ గ్రామానికి వెళ్లే బస్సు సాయంత్రం సమయంలో గంట ఆలస్యంగా రావడంతో ఆయా గ్రామాలకు వెళ్లే విద్యార్థినులు గంటపాటు రోడ్డుపై వేచి చూడాల్సి వస్తుందన్నారు. పాఠశాల ముగిసే సమయానికి బస్సులు వచ్చేలా చూడాలని కోరారు.

ధర్మపురి ఎస్ఐగా మహేష్

ధర్మపురి, ఆగస్టు 24: ధర్మపురి పోలీస్ ఎస్ఐగా గంగుల మహేష్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్ఐ ఉదయ్‌కుమార్ దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లారు. ఆయన స్థానంలో ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పని చేసిన మహేష్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలో పరిధిలో గల నేరాలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తానని అన్నారు.

భారీ వర్షానికి కూలిన వృక్షం

కోరుట్ల, ఆగస్టు 24 : పట్టణంలో శనివారం రాత్రి సమయంలో భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు గాలి బీభత్సంతో ఇందిరా రోడ్డులోని వ్యాపార సముదాయంలో ఉన్న భారీ వృక్షం నేలకొరగబడంతో విద్యుత్ సరఫరాతో పాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్, మున్సి పల్ అధికారులు చేరుకోని మరమతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు. కొన్ని ప్రాంతాల్లో కాలనీలు జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


కోరుట్లలో నేలకూలిన భారీ వృక్షం

రోడ్డుపై పడిన చెట్లు.. తొలగించిన విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి వారి క్రమ శిక్షణను నిరూపించుకున్నారు. మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో కోజన్ కొత్తూర్-ఎర్దండి గ్రామాల మధ్య రోడ్లపై చెట్లు విరిగి అడ్డంగా పడిపోవడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. అదే సమయానికి ఇబ్రహీం పట్నం మండల కేంద్రం నుంచి ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో చదువుతున్న విద్యార్థుల ఆర్టీసీ కాలేజ్ బస్సు అక్కడకు చేరు కోవడంతో బస్సులో ఉన్న విద్యార్థులు దిగి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి రోడ్డును క్లియర్ చేశారు. దింతో ప్రయాణికుల రాకపోకలు కొనసాగాయి.

రహదారులు జలమయం

మెట్‌పల్లి రూరల్ : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రహదారి జలమయమయ్యాయి. శనివారం మండలంలోని అల్లూరి సీతారామరాజు తండా గ్రామ శివారులో ప్రధాన రహదారిపై నుంచి ఉధృతంగా వర్షపు నీరు ప్రవహించడంతో గ్రామానికి రాక పోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్థులతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గ్రామంలోని సుమారు 30 మంది విద్యార్థులు వివిధ పాఠశాలలకు వెళ్లలేక ఇంటి వద్దనే ఉండిపోయారు. గ్రామం మీదుగా వెళ్లే నిజామా బాద్ జిల్లాకు పూర్తిగా రాకపోకలు నిలిచాయి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జిల్లా మాత శిశుసంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డి


వైద్య పరీక్షలు చేస్తున్న జైపాల్‌రెడ్డి

జగిత్యాలరూరల్, ఆగస్టు 24 : ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మాతశిశుసంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డి అన్నా రు. శనివారం జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటింటి సర్వేనిర్వహించి జ్వర పీడితులను గుర్తించారు. ఈసందర్భంగా రోగుల రక్తనమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు.

డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వ రభాదితులు వెంటనే వైద్యులను సంప్ర దించి చికిత్స పొందాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ

కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతిరెడ్డి

మల్లాపూర్, ఆగస్టు 24 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీలో అర్హులైన ప్రతీ ఒక్క రైతుకు అందుతుందని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లాల జలపతిరెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్యప్రచారాలను నమ్మెవారు ఎవరు లేరని విమర్శించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఇదివరకే బ్యాంకుల్లో రూ.18వేల కోట్లను డిపాజిట్ జరిగిందన్నారు. దీనిలో నుండి ఇదివరకే రుణమాఫీగా రూ.7,500ల కోట్లు రైతుల అకౌంట్లోకి వెళ్లాయన్నారు. బ్యాంకుల సాంకేతిక లోపాలతో కొంత మంది రైతులకు రుణమాఫీ ఆలస్యంగా అవుతుందన్నారు. రైతులు ఎవరు కూడా ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దన్నారు. ఈ కార్యక్రమంలో తిప్పిరెడ్డి అంజిరెడ్డి, పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, కోటగిరి ఆనంద్‌గౌడ్, నల్ల రాజన్న, మల్లయ్య, భూమయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, రమేశ్, రామలక్ష్మణ్, రాజన్, నారాయణ, రాజరెడ్డి ఉన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతిరెడ్డి

సంక్షిప్తం సమాచారం

మల్యాల: మల్యాల మేజర్ గ్రామ పంచాయతీ సిబ్బందికి సీఐ నీలం రవి దుస్తులు పంపిణీ చేశారు. బీసీ కాలనీకి చెందిన మాజీ వార్డు మెంబర్ గాండ్ల జ్యోతి సమకూర్చిన దుస్తులను 25 మంది సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో వేణు, ఆంజ నేయులు, మాజీద్, రాజు,వంశీ, విగ్నేష్ పాల్గొన్నారు.

●మల్యాలకు చెందిన బీఆర్ ఎస్ నాయకుడు మల్యాల దేవయ్య అనారోగ్యంతో శనివారం మృతిచెందగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకు ముందు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు జనగాం శ్రీనివాస్, బద్దం తిరుపతి రెడ్డి ఉన్నారు

మెట్‌పల్లి రూరల్: సీజనల్ వ్యాధులపై ప్ర జలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి నిజామొద్దీన్ శనివారం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ జ్వరపీడిత సర్వేను చేపడుతూ ఇంటి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిం చారు.

ఇబ్రహీంపట్నం: బీఎల్‌వోలు పకడ్బందీగా ఓటరు సర్వేని నిర్వహించాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

మల్లాపూర్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పుట్టిన రోజును పురస్కరించుకొని మండలంలోని వీవీరావుపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశా లలోని విద్యార్థులకు శనివారం బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. 25న ఎంపీ అర్వింద్ పుట్టిన రోజున పాఠశాలకు సెలవు ఉన్నందున ముందస్తుగా విద్యార్థులకు నోట్‌బుక్కులను అందజేశామన్నారు.

కొడిమ్యాల : మండలంలోని చెప్యాల గ్రామంలో శనివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో చెప్యాల గ్రామానికి చెందిన గుగ్గిళ్ల నాగ భూషణాచారి రచించిన సమాజ హితం కోరె భూషణ శతకం పుస్తకాన్ని సాహిత్య రత్న అవార్డు పొందిన కవి, రచయిత జక్కని గంగాధర్ (ముంబాయి) ఆవిష్కరించారు.

కథలాపూర్: మండలంలోని భూషణ రావుపేట, కథలాపూర్ గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. భూషణ రావుపేటలో దేశవేని లక్ష్మయ్య, మారంపల్లి వినోద్, సత్తమ్మకు చెక్కులు పంపిణీ చేశారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాల, విస్డమ్ కిడ్స్ వరల్డ్ ప్లే స్కూల్, విశ్వశాంతి, గ్రీన్‌వుడ్ పాఠశాలతో పాటు మండలంలోని ఇటిక్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సీమలదారి సదాశివ్, ప్రిన్సిపాల్‌లు బాలె శేఖర్, రాజు రెడ్డి, కరస్పాండెంట్ జయశ్రీ, ఆయా పాఠశాలల డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామాన్ని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు గ్రామీణ ఆర్థిక పరిస్థితులపై విశ్లేషణ కోర్సులో భాగంగా విద్యార్థులు శనివారం సందర్శించారు. వివిధ రకాల ప్రధాన పంటలు, పంటల సాగు ఖర్చుల గురించి రైతుల వద్ద అడిగి తెలుసుకున్నారు. అలాగే అల్లీపూర్ రైతు ఉత్పాదక సంస్థలో వయ్యారి భామ కలుపు మొక్కల వల్ల కలిగే నష్టాల గురించి శాస్త్రవేత్తలు డాక్టర్ డీప రజనీదేవి, మృత్తిక శాస్త్రవేత్త డాక్టర్ రవి వివరిం చారు.

జగిత్యాల అగ్రికల్చర్: జగిత్యాల జిల్లా సహకార అధికారి(డీసీవో)గా బాధ్యతలు స్వీకరించిన మనోజ్‌కుమార్‌ను జిల్లా సహకార సంఘాల ఫోరం బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కల్లెడ, జైన, నంచర్ల, చందోళి, ప్యాక్స్ సంఘాల చైర్మెన్‌లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, నరేష్, వేణుగోపాల్‌రావు, వెంకటమాధవరావు తదితరులున్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని వంజరిపల్లి గ్రామంలో మూడేళ్ల క్రితం మహిళ సంఘాల్లోని డబ్బులను అవినీతికి పాల్పడ్డ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయానికి వంజరిపల్లి గ్రామస్థులు తరలివచ్చి సీఐ కృష్ణారెడ్డికి విన్నవించారు. సీఐ మాట్లాడుతూ రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి ఆధారాలు సమర్పిస్తే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సూచించారు.

●జగిత్యాలలోని పావని కంటి ఆస్పత్రి, ఆపి, రోటరీ క్లబ్‌వారి ఆధ్వర్యంలో జగిత్యాల ని యోజకవర్గానికి చెందిన 10 మందికి ఉచితకంటి పరీ క్షలను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చేశారు. అనంత రం పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని క్రిష్ణానగర్ బైపాస్ రోడ్డులో గల తపోవన్ హైస్కూల్‌లో శనివారం ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో కరస్పాడెంట్ అనుమల్లశ్యామ్, ప్రిన్సిపల్ శ్వేత, ఉపాధ్యాయులు, విధ్యార్థిని, విధ్యార్థులు పాల్గొన్నారు.

జగిత్యాల, (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ ఆర్య వైశ్య సంఘ అధ్యక్ష పదవికి జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తి చేసిన తదుపరి శనివారం ఎనిమిది మంది అభ్యర్థుల నామినేషన్లు గుర్తించినట్లుగా ఎన్నికల అధికారి మోటూరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన వుతూరి గంగాధర్, వూటూరి నవీన్ కుమార్, యెరవెల్లి సురేశ్, పల్లెర్ల సురేందర్, రేనికుంట శ్రీనివాస్, జిల్లా గంగాదర్, బొడ్ల జగదీశ్, కప్పల శ్రీకాంత్‌లు నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు అందించారని తెలిపారు. నామినేషన్ల ఉప సంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా ప్రకటన చేస్తామన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని విజ్‌డమ్, విద్యా భారతి విద్యా సంస్థల్లో, విన్నర్స్ ఇంగ్లీష్ పాఠశాలలో, మండలంలోని తిర్మలాపూర్ ఉన్నత, ప్రా థమిక పాఠశాలల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను చిన్నారులు ఘనంగా నిర్వహించారు. కృష్ణు డు, గోపికల వేషాదారణల్లో చిన్నారులు పలువురిని ఆకట్టుకున్నారు. చిన్నారులు ఉట్టి కొట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోత్స్నదేవి, పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ దీకొండ అశోక్, ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ చిలువేరి అరవింద్, పలు వురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెగడపల్లి : నేరాల నిరోదన, నేరాల చేదనే లక్ష్యంగా పోలీసులు పని చేయాలని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పెగడపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆక స్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, స్టేషన్ పరి సరాలు, ఎంత మంది సిబ్బంది ఉన్నారు, సిబ్బంది విధులు , ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దొంగతనాలు జరుగకుండా చూసుకోవాలని, 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూ కోల్ట్స్, పెట్రోల్ కార్ నిరం తరం 24 గంటలు గస్తీ తిరగాలని సూచించారు.